క్లుప్తంగా

ఆదర్శ ప్రాథమిక పాఠశాల పరిశీలన



విద్యార్థులతో డీఈవో షేక్ సలీం భాషా, ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: మెగా పేటీఎంలో భాగంగా గురువారం పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్.షేక్ సలీం భాషోపాధ్యాయులను ఆదేశించారు. సాకుర్రు గరువు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను డీఈవో బుధవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. తరగతుల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

డీటీ, ఏఎన్ఎం రాత పరీక్షల వాయిదా

యానాం: ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, ఫార్మసిస్ట్, ఈసీజీ టెక్నీషియన్, థియేటర్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు ఈనెల 13న నిర్వహించాల్సిన రాత పరీక్షను, రెవెన్యూశాఖలో డిప్యూటీ తహసీల్దార్ పోస్టుకు ఈనెల 20న నిర్వహించాల్సిన రాతపరీక్షను పాలనాపరమైన కారణాలతో వాయిదా వేస్తున్నట్లు డీపీఅండ్ఏఆర్ అండర్ సెక్రటరీ వి.జయశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే రాత పరీక్షల తేదీలను ప్రకటిస్తామన్నారు.

సీఎం రంగసామి రాజీనామా ప్రకటనపై కలకలం

యానాం: పుదుచ్చేరి సీఎం రంగసామి, లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ), రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.కైలాసనాథన్ మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. వివిధ శాఖల డైరెక్టర్ల నియామకంలో తాను చేసిన సిఫార్సులతో కూడిన పేర్ల జాబితాను పక్కనపెడుతున్నారని ఏకపక్షంగా ఎల్జీ వ్యవహరిస్తున్నారని ఒక్క డైరెక్టర్ పదవిని కూడా తాను నియమించలేకపోయినప్పుడు తనకు ఈ ముఖ్యమంత్రి పదవి ఎందుకు ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీఎం రంగసామి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం బుధవారం పుదుచ్చేరి వ్యాప్తంగా కలకలం రేపింది. కొన్ని నెలలుగా ఎల్జీ కైలాషనాథన్‌కు, సీఎం రంగసామికి మధ్య నిరంతరం వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో స్పీకర్ సెల్వంకు రంగసామి ఫోన్‌చేసి తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రంగసామిని శాంతింపజేయడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. పుదుచ్చేరిలో రాజకీయపరిణామాల నేపథ్యంలో అత్యవసర సమావేశానికి రావాలని ఆదేశాల మేరకు యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ పుదుచ్చేరి బయలుదేరి వెళ్లారు.

జాతీయ రహదారి చెంతన పేరుకుపోతున్న చెత్త

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం జంక్షన్‌కు సమీపంలో రహదారి చెంతన ఫుట్‌పాత్‌పై చెత్తను వేయడంతో స్థానికులు, పాదచారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ రహదారిలో చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు, విద్యార్థులు వాపోతున్నారు. రహదారి చెంతన చెత్త వేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేసారు.

డ్వాక్రా రుణాల సొమ్ము స్వాహా కేసులో వీఓఏల అరెస్టు

అమలాపురం రూరల్: పాలగుమ్మి గ్రామంలో గతంలో డ్వాక్రా రుణాల సొమ్మును స్వాహా చేసిన ఇద్దరు వీఓఏలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు తాలూకా ఎస్సై శేఖర్‌బాబు బుధవారం తెలిపారు. డ్వాక్రా సభ్యులు చెల్లించిన సుమారు రూ.20 లక్షల సొమ్మును ఇద్దరు వీఓఏలు కట్టా వెంకటలావణ్య, బొక్కా కనక మహాలక్ష్మి స్వాహా చేశారు. డ్వాక్రా సభ్యులు చెల్లించిన స్త్రీనిధి, బ్యాంకు రుణాలు, ఎస్సీఎస్టీ రుణాలు తమ సొంత అవసరాలకు వినియోగించుకుని స్వాహాకు పాల్పడ్డారన్న ఫిర్యాదుపై గతంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. దర్యాప్తు అనంతరం ఇద్దరు వీఓఏలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లుగా ఎస్సై చెప్పారు.

మోటార్ సైకిల్ దహనం కేసులో 8 మంది అరెస్టు

అల్లవరం: అల్లవరం పంచాయతీ పరిధిలోని గోసంగివారిపేటకు చెందిన నూకపెయ్యి సత్యనారాయణ చేతబడి చేస్తున్నారన్న అనుమానంతో అతని ఇంటిపై దాడి చేసి, మోటార్ సైకిల్ దహనం చేసిన సంఘటనపై 8 మంది యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తిరుమలరావు బుధవారం తెలిపారు. సోమవారం రాత్రి 11 గంటలకు జరిగిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి ఇదే ప్రాంతానికి చెందిన యువకులు ఉల్లింగి సందీప్, దిలీప్, ప్రదీప్‌తో పాటు మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచామని ఎస్సై తెలిపారు.

పారిశుధ్యం.. అధ్వానం

- డ్రెయిన్ల నిర్మాణ లోపంతో ముందుకు పారని మురుగు
- వీధుల్లో తాండవిస్తున్న అపరిశుభ్రత
- చెత్త సమస్యలతో పట్టణ ప్రజలు సతమతం
- వార్డుల్లో పర్యటించి పరిశీలిస్తున్న కమిషనర్



అమలాపురం ఓ వార్డులో ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయిన డ్రెయిన్, పక్కనే చెత్త

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం 30 వార్డుల్లో దాదాపు 60 వేల మంది జనాభాతో 7.02 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇటీవల ప్రతి నెలా నిర్వహిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు తమ వార్డులో పారిశుధ్య నిర్వహణ బాగోలేదని గగ్గోలు పెడుతున్నారు. రెండు వారాల కిందటే మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్‌కు కౌన్సిలర్ల నుంచి, ఆయా ప్రాంతాల ప్రజల నుంచి పారిశుధ్య సమస్యల తాకిడి పెరిగింది. దీంతో కమిషనర్ పట్టణమంతా క్షేత్రస్థాయి పరిశీలన, పర్యటనతో ప్రతి రోజు ఉదయాన్నే ఓ వార్డులో ప్రత్యేక డ్రైవ్ పేరుతో పారిశుధ్య సమస్యలను స్వయంగా చూస్తున్నారు. ఆయా వార్డుల కౌన్సిలర్లతో పాటు ప్రజలు కూడా పారిశుధ్య సమస్యలు ఏకరువు పెడుతుండడంతో కమిషనర్ తన స్వీయ పరిశీలనలో సమస్య తీవ్రతను గుర్తించారు.

సమస్యలు ఇలా

పారిశుధ్య సమస్యలను పరిశీలిస్తే ప్రధానంగా డ్రెయిన్ల (మురుగు కాలువలు) నిర్వహణ అధ్వానంగా ఉంది. ఏ మూల చూసినా మురికి కూపాలే కనిపిస్తున్నాయి. పలు చోట్ల చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల డ్రెయిన్లలో పూడిక తీతకు మున్సిపాలిటీ రూ.30 లక్షలు కేటాయించింది. వర్షాలు వస్తున్నప్పుడు డ్రెయిన్ల పూడికలు తీసి అదే డ్రెయిన్ గట్టు మీద వేయడం, సరైన ఎండ లేక, పూడిక మట్టి ఆరకముందే వర్షాలకు తిరిగి డ్రెయిన్లలోనే జారుతోంది. ఇదే సమస్యను గత నెల 27న నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలువురి కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ కొన్ని రోజుల క్రితం పట్టణంలో చేపట్టిన డ్రెయిన్లలో పూడికతీత పనులను వర్షాల సమయంలోనే నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అపరిశుభ్రత

ఉదయం మున్సిపాలిటీ చెత్త ట్రాక్టర్ల ద్వారా వీధుల్లోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నప్పటికీ ఆ తర్వాత ప్రజల్లో కొందరు చెత్తను వేయడంతో ఆ ప్రాంతాలు, డ్రెయిన్లు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యానికి, ప్రజల అలసత్వం తోడై పట్టణం పారిశుధ్య సమస్యలకు నిలయంగా మారింది. మున్సిపాలిటీలో 40 మంది రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు, అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) 93 మంది కార్మికులు, 39 మంది వికాస్ ద్వారా నియమితులైన కార్మికులు ఉన్నారు. 172 మంది పారిశుధ్య కార్మికులు రోజూ పారిశుధ్య పనుల్లో నిమగ్నమవుతారు. పట్టణం నుంచి రోజుకు సుమారు 35 టన్నుల చెత్తను సేకరిస్తారు. దాదాపు 37 కిలోమీటర్ల మేర అన్ని రకాల డ్రెయిన్లు విస్తరించి ఉన్నాయి.

కమిషనర్ పర్యటన

కొత్తగా వచ్చిన కమిషనర్ ఇప్పటికే ఆరు వార్డుల్లో పర్యటించారు. ప్రతి వార్డులో తాగునీరు, వీధి దీపాల సమస్యలను ప్రజలు చెప్పుకుంటూనే పారిశుధ్య సమస్యలను మాత్రం అధికంగా చెబుతున్నారు. కౌన్సిలర్లు దగ్గరుండి ఫలానా డ్రెయిన్ నిర్వహణ సక్రమంగా లేదని, ఫలానా చోట చెత్త బాగా పేరుకుపోతోందని కమిషనర్‌కు స్వయంగా చూపిస్తున్నారు. పలు చోట్ల డ్రెయిన్లలో వాలు పరంగా ఎత్తు పల్లాలు ఉండడం వల్ల మురుగు నీరు సక్రమంగా పారడం లేదని కమిషనర్ అంటున్నారు. ఈ సమస్యను తమ ఇంజినీర్లతో మాట్లాడి సాంకేతిక లోపాలను సరిచేసేందుకు చర్యలు చేపతానని చెబుతున్నారు. పారిశుధ్య కార్మికులు ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచేలా, చెత్త కుప్పలు నిల్వలు లేకుండా ప్రతి రోజూ పర్యవేక్షణతో చర్యలు తీసుకుంటామంటున్నారు.

172 మంది పారిశుధ్య కార్మికులు, అధికారులున్నా ఫలితం శూన్యం

పారిశుధ్య విభాగాన్ని ఓ ఇంజినీరు, శానిటరీ మేస్త్రీలు పర్యవేక్షిస్తున్నా పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు, కౌన్సిలర్ల నుంచి ఎందుకు ఫిర్యాదుల అధికమవుతున్నాయి. మున్సిపాలిటీ 172 మంది పారిశుధ్య కార్మికుల ఉన్నా చెత్త సమస్యలు ఎందుకు ఎక్కువవుతున్నాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని కౌన్సిలర్లు అంటున్నారు. ఇదే సమయంలో పట్టణ ప్రజలు కూడా డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త వేయకుండా, మున్సిపల్ చెత్త ట్రాక్టర్ లేదా టిప్పర్ వారి ప్రాంతాలకు వచ్చినప్పుడు చెత్తను ప్రతి రోజూ అందిస్తే చాలా వరకూ చెత్త సమస్య పరిష్కారమవుతాయి.

శాకంబరీదేవిగా వేపచెట్టు కనకదుర్గమ్మ



శాకంబరీదేవి అలంకరణలో అమ్మవారు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలనువీధిలో కొలువై ఉన్న వేప చెట్టు కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢం మాసం సందర్భంగా అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, పువ్వులతో బుధవారం అలంకరించారు. శతాబ్దాల చరిత్ర గల ఆలయంలో అమ్మవారు శాకంబరీదేవి దర్శనమివ్వడంతో భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకూ అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి సంబరాలు ఈనెల 31న ఆలయం వద్ద వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

‘ప్రేమకు ఆహ్వానం’ పుస్తకావిష్కరణ



ప్రేమకు ఆహ్వానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణ కామేశ్వర్ తదితరులు

అమలాపురం టౌన్: హిమాలయ గురువులు మహావతార్ బాబాజీ నాగరాజ్ చెప్పిన అంశాలను ఇవాన్నే డెలాఫ్లోర్ ఆటోమేటిక్ రైటింగ్ ద్వారా రాసిన ఆంగ్ల పుస్తకానికి అనువాదమైన ‘ప్రేమ ఆహ్వానం’ పుస్తకాన్ని అమలాపురానికి చెందిన పుస్తక తుది పరిశీలకుడు, రచయిత పుత్సా కృష్ణ కామేశ్వర్ బుధవారం ఆవిష్కరించారు. పి.గౌతమి, ఎం.మాధవి, ఎస్. శైలజ, ఎస్.జ్వాల, సుధ, శ్రీపాద వల్లి ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమలాపురానికి చెందిన రుద్రరాజు విశ్వనాథరాజు ఈ పుస్తకాన్ని ప్రచురించారు. జ్ఞానోదయం పొందిన వారికి 108 జ్ఞాపికలు ఈ పుస్తకంలో ఉంటాయని పుస్తక పరిశీలకులు కృష్ణ కామేశ్వర్ తెలిపారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బాబాజీ భక్తులు పాల్గొని ప్రేమకు ఆహ్వానం పుస్తకాలను అందుకున్నారు. కార్యక్రమంలో గొట్టుముక్కల నాగ ప్రసాద్, అరిగెల బుజ్జి పాల్గొన్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అప్పన్న ఎంపిక



మాస్టర్స్ జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన అప్పన్నను అభినందించి సత్కరిస్తున్న జిమ్ ప్రతినిధులు, క్రీడాకారులు

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ అండ్ ఫిటినెస్ జిమ్‌కు చెందిన సీనియర్ పవర్ లిఫ్టర్ బి.అప్పన్న మాస్టర్స్ జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. వచ్చే నెల ఆగస్టు 2 నుంచి 7వ తేదీ వరకూ కేరళలో నిర్వహించనున్న మాస్టర్స్ నేషనల్ పవల్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ టీమ్ నుంచి అప్పన్న తలపడనున్నారన్నారు. 120 కేజీల విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి రాష్ట్రం తరపున జాతీయ పోటీల్లో సత్తా చాటనున్న అప్పన్నకు స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో బుధవారం ఉదయం అభినందన సభ జరిగింది. జిమ్ లైఫ్ మెంబర్ గారపాటి చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ అభినందన సభలో పలువురి జిమ్ క్రీడాకారులు, పట్టణ ప్రముఖులు అప్పన్నను అభినందించి సత్కరించారు. మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, జిమ్ ప్రతనిధులు, క్రీడాభిమానులు మట్టపర్తి వెంటక సముద్రం, గంగుమళ్ల దొరబాబు, యనమదల పల్లంరాజు, నక్కా సుధాకర్‌బాబు, మారే వీరేంద్ర తదితరులు అప్పన్నను అభినందించారు. జాతీయ పోటీల్లోనూ అప్పన్న విజేతగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిమ్ క్రీడాకారుల ప్రతిభ

రాజమహేంద్రవరంలో నిర్వహించిన కేరళ రాష్ట్రం కాసరగోడ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ వెయిట్ లిఫ్టర్లు బి.యశ్వంత్ 79 కేజీల విభాగంలోనే కాకుండా స్నాచ్ విభాగంలో 100 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ విభాగంలో 130 కేజీలు మొత్తం 230 కేజీల బరువును ఎత్తి గోల్డ్ మెడల్‌తో పాటు స్ట్రాంగ్ మెన్ అవార్డును కైవసం చేసుకున్నాడని జిమ్ కోచ్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. 65 కేజీల విభాగంలో జె.జితేంద్ర దొర గోల్డ్ మెడల్, 63 కేజీల విభాగంలో యు.శశికళ గోల్డ్ మెడల్, 69 కేజీల విభాగంలో ఐ.ఇందిర సిల్వర్ మెడల్‌ను గెలుచుకున్నారన్నారు. విజేతలను కూడా జిమ్‌లో బుధవారం ఉదయం తోటి వెయిట్ లిఫ్టర్లు అభినందించారు. ఈ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించిన సీనియర్ వెయిట్ లిఫ్టర్ మారే వీరేందర్‌ను, విజేతలను జిమ్ కోచ్ డాక్టర్ వెంకటేశ్వరరావు సత్కరించి ప్రశంసించారు.

రైతు భరోసా కేంద్రాలపై విచారణ

అమలాపురం రూరల్: రైతు భరోసాలకు ప్రభుత్వం అందించిన మెయింటనెన్స్ గ్రాంట్స్ పక్కదారి పట్టాయన్న ఆరోపణలతో కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్నతాధికారులు ప్రత్యేక దర్యాప్తు చేస్తున్నారు. అమలాపురం రూరల్ మండలం సమనస రైతు భరోసా కేంద్రంలో బుధవారం విచారణ చేశారు. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలాలకు సంబంధించిన 85 రైతు భరోసా కేంద్రాలకు మంజూరైన గ్రాంట్స్‌పై విచారణ చేపట్టారు. రామచంద్రపురం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగకుమార్ ఆధ్వర్యంలో ఈ దర్యాప్తు సాగింది. మొత్తం 85 రైతు భరోసా కేంద్రాలకు ప్రైవేట్ భవనాల్లో కొనసాగిన 17 రైతు భరోసా కేంద్రాలతో పాటు ప్రభుత్వ భవనాల్లో కొనసాగే రైతు భరోసా కేంద్రాలపై దర్యాప్తు నిర్వహించారు. అద్దెలు, కరెంట్ బిల్లులు, స్టేషనరీ తదితర ఖర్చులకోసం ప్రభుత్వం నెలకు రూ. 2వేలు ఇచ్చేవారు. ఈ నిధులు వినియోగంలో కొన్ని ప్రాంతాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆడిట్ చేపట్టామని అధికారులు తెలిపారు.

తాత్కాలిక రహదారికి రక్షణ ఏర్పాట్లు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం–కోటిపల్లిరేవులో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి వరదనీటితో కోతకు గురవుతుంది. దీంతో రేవు నిర్వాహకులు రహదారి కొట్టుకు పోకుండా ఇసుక బస్తాలతో రక్షణ ఏర్పాట్లు చేశారు. రెండు రోజులుగా వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో తాత్కాలిక రహదారిని వరద నీరు చుట్టుముట్టింది. దీంతో సగం రహదారి కోతకు గురైంది. దీంతో ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని ఈ రక్షణ చర్యలు చేపట్టినట్లు రేవు నిర్వాహకులు తెలిపారు.

కార్మిక హక్కులపై హోరెత్తిన సార్వత్రిక సమ్మె



అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై అమలాపురం పుర వీధుల్లో పలు సంఘాలకు చెందిన కార్మికులు నిరసనలతో బుధవారం కదం తొక్కారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక ఒక రోజు సమ్మెలో భాగంగా అమలాపురంలో పలు కార్మిక సంఘాలు నిరసన ర్యాలీలు నిర్వహించాయి. కార్మికుల హక్కులపై కార్మికులు చేసిన నినాదాలతో అమలాపురం హోరెత్తింది. మాజీ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు తదితరుల ఆధ్వర్యంలో ఎర్ర జెండాలతో నిరసన ర్యాలీ సాగింది. గడియారం స్తంభం సెంటరులో కార్మికులనుద్దేశించి కార్మిక నేతలు మాట్లాడారు. కోడ్‌లు అమలులోకి వస్తే కార్మికులు హక్కులను కోల్పోతారని మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఏపీ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు గుబ్బల గోపాలకృష్ణ, పలు కార్మిక సంఘాల నాయకులు బి.శ్రీరామమూర్తి, ఎం.వెంకటేశ్వరరావు, ఊటాల వెంకటేష్, రాయుడు ప్రసాద, కొప్పుల బాబి, నిమ్మకాయల శ్రీనివాసరావు, నెల్లి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు, బొక్కా నాని, ఐద్వా నాయకురాలు టి.నాగవరలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొని ర్యాలీలో నిరసన తెలిపారు.

బ్యాంక్ ఉద్యోగుల నిరసన

ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) పిలుపు మేరకు సార్వత్రిక సమ్మెలో భాగంగా కోనసీమలోని వివిధ బ్యాంక్‌ల బ్రాంచీలకు చెందిన దాదాపు 250 మంది అధికారులు, ఉద్యోగులు అమలాపురానికి తరలివచ్చి స్థానిక యూనియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచి వద్ద బుధవారం ఉదయం నిరసన తెలిపారు. బ్యాంక్ నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుచరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను వారు దుయ్యబట్టారు. కోనసీమ బ్యాంక్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు టీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వైఎల్ ప్రసాద్, దుర్గేష్ (కెనరా బ్యాంక్), మల్లేష్ (ఇండియన్ బ్యాంక్), వివిధ బ్యాంక్‌లు బ్రాంచీల అధికారులు, ఉద్యోగులు పీఎస్‌బీ రాజేష్, కె.ఈశ్వరరావు, కె.రమణ, సత్యదుర్గ, శ్రావణి, లిఖిత, ఎం.నాగభూషణం, తాతారావు, సూర్యప్రకాష్, ప్రసాద్ తదితరులు నిరసన ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

అల్లవరం: కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తక్షణమే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా అల్లవరం మండల సీఐటీయూ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నభోజనం పథకం, వీఓఏ, శానిటేషన్ సిబ్బంది అల్లవరం తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావుకు కార్మిక సంఘాలు 19 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబత్తుల రత్నకుమారి, ఎం విజయలక్ష్మీ, పద్మ, శ్యామల, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, శానిటేషన్, వీఓఏలు పాల్గొన్నారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా ఉప్పలగుప్తం సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మునిపల్లి ప్రధాన రహదారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు బుధవారం నిరసన తెలిపాయి. అనంతరం తహసీల్దార్ వాసా దివాకర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

సార్వత్రిక సమ్మె ప్రశాంతం

కాట్రేనికోన: నూతన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు చేపట్టిన అఖిల భారత కార్మిక సార్వత్రిక కాట్రేనికోనలో ప్రశాంతంగా జరిగింది. రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ) పిలుపు మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యర్రం శెట్టి రామచంద్రరావు ఆధ్వర్యంలో సహకార సంఘాల ఉద్యోగులు డీసీసీబీ శాఖ కాట్రేనికోన వద్ద నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో సీఈఓలు డి రామకృష్ణంరాజు, ప్రసాద్, వరహాల రాజు, సురేష్ పాల్గొన్నారు. సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు.

ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ధర్నా

అమలాపురం రూరల్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా అమలాపురం ఆర్టీసీ డిపోలో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం గ్యారేజ్ గేట్ ధర్నా నిర్వహించారు. సార్వత్రిక సమ్మెకు యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి కే. చింతా రంగ ప్రసాద్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిపో ఉప కార్యదర్శి కే. భీమేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆర్టీసీలో వెంటనే నియామకాలు చేపట్టి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు.యూనియన్ గౌరవ అధ్యక్షుడు కేఎస్ నారాయణ, జిల్లా కార్యదర్శి వంక గణపతి, భ్రమరాంబ, బీఎస్ నారాయణ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

యానాం: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా యానాంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెలో వందలాదిగా కార్మికులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో చిన్నతరహా పరిశ్రమలను మూసివేసి అధికసంఖ్యలో కార్మికులు సమ్మెక మద్దతుగా పాల్గొని ర్యాలీ నిర్వహించారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, కార్మికులు ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నేతలు కుంచే సత్యనారాయణ, తాళ్లపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ సంఘాలు బుధవారం తాళ్లరేవులో కదం తొక్కారు. సీఐటీయూ, ఏపీ వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావు తదితరులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్ పి.త్రినాథరావు, ఎంపీడీఓ కె.సత్యనారాయణకు వినతిపత్రం అందజేసారు.

సమ్మె జయప్రదం

ముమ్మిడివరం: సీఐటీయూ, ఎంటీయూసీ, వ్యవసాయ,కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, రిటైర్డు ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ముమ్మిడివరంలో నిర్వహించిన సమ్మె విజయవంతమైంది. స్థానిక ఎంఆర్ఓ కార్యాలయం నుంచి ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల వరకు నిరసన ర్యాలీ అనంతరం జాతీయ రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని మద్దతు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తాళ్లరేవు: ఈ నెల 11న శుక్రవారం మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజరం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్స్‌కు సంబంధించి ట్రీ ట్రిమ్మింగ్ భాగంగా సుంకరపాలెం, లచ్చిపాలెం, ఉప్పంగల పంచాయతీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలో నూతనముగా నిర్మించుచున్న 11/ కేవీ లైన్ నిర్మాణ పనులు చేపట్టడంతో ఐ.పోలవరం సబ్ స్టేషన్ పరిధిలో గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ కోతకు అంతరాయం కలుగుతోందని ఏఈ కె.రాంబాబు తెలిపారు. ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, ఎర్రగరువు, జి. మూలపాలెం, కేశనకుర్రు, తిల్లకుప్పలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి

ఆలమూరు: దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పారా స్వచ్ఛంద సంస్థ ల్యాంప్ అడ్వకసీ కో ఆర్డినేటర్ మారే సుబ్బాయమ్మ, సీబీఆర్ కోఆర్డినేటర్ బడుగు మహిమారావు అన్నారు. మండలంలోని సంధిపూడి పంచాయతీ వద్ద సర్పంచ్ తోట భవాని అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో పారా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన సదస్సు నిర్వహించి భారీ ర్యాలీ నిర్వహించారు. బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. దివ్యాంగుల్లో ఉన్న అంగవైకల్యాన్ని 21 రకాలుగా గుర్తించి ఆమేరకు ప్రభుత్వం సదరం ధ్రువ పత్రాలను జారీ చేస్తుందన్నారు. ఆర్టీసీ సమకూర్చిన బస్ పాస్‌లను రాయితీపై 20 మంది దివ్యాంగులకు సర్పంచ్ భవాని పంపిణీ చేశారు. ఎంపీటీసీ తోలేటి సంతోషి, గ్రామ పెద్దలు దొడ్డ సుబ్బారావు, నల్లా వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.